సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



పత్తి కొనుగోళ్లకు 14 కేంద్రాలు

సీసీఐ ఆధ్వర్యాన పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పద్నాలుగు కేంద్రాలను ఎంపిక చేశారు.

10లో



వర్గీకరణ చేపట్టే వారితోనే దోస్తీ

ఎస్సీ వర్గీకరణకు స్పష్టమైన హామీ ఇచ్చే పార్టీకే మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు.

10లో

గరిష్టం / కనిష్టం
32° / 22°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం మాత్రం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయీస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన వారు వైరాలోని లార్జ్‌సైజ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లా వాసులు కొత్తగూడెంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయా కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం ఉంటుందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

100 శాతం ఫలితాలు సాధించాలి

భద్రాచలంటౌన్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల మార్కుల ఆధారంగా గ్రేడ్‌లను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ ఒకటో తేదీ నాటికి స్టడీ మెటీరియల్ అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో గణితం బోధనకు స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో మెళకువలు నేర్చేందుకు ఐటీడీఏ నుంచి సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఏపీఓ డేవిడ్‌రాజ్, రమణయ్య, మంగతాయారు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలుకు ఎనిమిది కేంద్రాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మొక్కజొన్న కొనుగోలుకు జిల్లాలోని గుండాల, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో ఎనిమిది కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. తన చాంబర్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కజొన్నకు రూ. 2,090 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లాలో 59,185 ఎకరాల్లో మొక్కజొన్న సాగైందని అన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కొర్సా అభిమన్యుడు, జిల్లా సహకార శాఖాధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

రామాలయానికి భద్రాద్రి వాసి విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా

భద్రాచలం: భద్రాద్రిలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి భద్రాచలంకు చెందిన చక్క సాయిసుహారిక గురువారం విరాళం అందజేశారు. గోశాల అభివృద్ధికి రూ.50వేలు, అన్నదాన నిమిత్తం రూ.50 వేలను ఆలయ అధికారులకు అందజేయగా వారు దాతకు రశీదు ఇచ్చి స్వామి దర్శనం చేయించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎల్.సాయిబాబా, అర్చకులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చల్లారని అసమ్మతి



రాంగ్‌రూట్‌లో వెళుతున్న రవిచంద్ర !

- ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా వద్దిరాజు
- అసంతృప్తులపైనే ఎక్కువ ఫోకస్ పెట్టిన ఎంపీ
- ఆయన పనితీరుపై పలువురి అసంతృప్తి



ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో పర్యటిస్తున్న వద్దిరాజు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన తేదీలు సమీపిస్తున్నా గులాబీ నేతల్లో అసమ్మతి పూర్తిగా సద్దుమణగడం లేదు. ఒక చోట అసంతృప్తులను చల్లారిస్తే మరోచోట కొత్తగా తిరుగుబాటు స్వరాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సీఎం పర్యటన ఖరారైన ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్న వద్దిరాజు రవిచంద్రకు పార్టీ కేడర్‌ను ఒక్క తాటిపైకి తేవడం సవాల్‌గా మారింది.

అభ్యర్థుల ప్రకటనకు ముందే..

ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటనకు ముందే బీఆర్‌ఎస్‌లో గ్రూప్ రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆగస్టు 21న అభ్యర్థుల ప్రకటన వెలువడిన తర్వాత ఈ రెండు నియోజకవర్గాల బాధ్యతలను ఎంపీ వద్దిరాజుకు పార్టీ పెద్దలు అప్పగించారు. ఆయన రాక సందర్భంగా కొత్తగూడెంలో వనమా, ఇల్లెందులో హరిప్రియ భారీగా స్వాగతం పలికారు. ఆ తర్వాత అసమ్మతిని దారిలో పెట్టే పనిలో ఎంపీ మునిగిపోయారు. ముందుగా ఇల్లెందు నేతలతో సమావేశమయ్యారు. అసమ్మతి నేతల డిమాండ్‌లను పరిగణనలోకి తీసుకుని మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో వరుసగా సమావేశాలు ఏర్పాటు చేయించారు. అనంతరం గార్ల, బయ్యారం మండలాల్లో పార్టీ మారుతారనే ప్రచారం జరిగిన నేతలతో సంప్రదింపులు చేపట్టారు. మొత్తంగా అసమ్మతి నేతల గళం వినే పార్టీ ప్రతినిధి అనే పేరు తెచ్చుకున్నారు.

హైదరాబాద్‌కు 'గూడెం' సెగ..

ఇల్లెందులో అసంతృప్త నేతలను పార్టీ పెద్దలతో వద్దిరాజు సమావేశపర్చడం కారు పార్టీలో చర్చకు దారితీసింది. దీంతో కొత్తగూడెం మున్సిపాలిటీలో అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ ఇబ్బందులను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలంటూ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మొదలైన గ్రూప్ రాజకీయ సెగలు హైదరాబాద్ వరకు వెళ్లాయి. దీంతో జ్వరంతో బాధపడుతున్నప్పటికీ వద్దిరాజు మరుసటి రోజే కొత్తగూడెం చేరుకుని కౌన్సిలర్లతో చర్చలు జరిపారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ పరంగా అన్ని విధాలా సాయం చేస్తామంటూ వారికి భరోసా కల్పించారు.

మా సేవలకు గుర్తింపేది..?

సర్పంచ్ మొదలు మున్సిపల్ కౌన్సిలర్ వరకు గెలిచిన ప్రజాప్రతినిధులతోనే వద్దిరాజు మాటామంతీ నిర్వహిస్తుండటం ఇప్పుడు గులాబీ పార్టీ నేతల ఆగ్రహానికి కారణమైంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన వారు సైతం వీరితో జత కలుస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ స్థాయిలో కార్యకర్త మొదలు ఎమ్మెల్యే స్థాయి వరకు అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే 'కారు' విజయం దిశగా పరుగులు పెడుతుందని, అలా కాకుండా కేవలం స్థానిక ప్రజాప్రతినిధులే ముఖ్యమన్నట్టుగా పార్టీ పెద్దల తీరు ఉండడాన్ని ఆఫ్ ది రికార్డుగా వారు తప్పుపడుతున్నారు. గత ఐదేళ్లుగా తాము చేసిన సేవలకు గుర్తింపు ఇదేనా అని పార్టీ పరమైన పదవుల్లో ఉన్నవారు ప్రశ్నిస్తున్నారు.

ఒక్క సమావేశం లేదు..

ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు వద్దిరాజు రవిచంద్ర ఇన్‌చార్జ్‌గా వచ్చిన తర్వాత రెండు చోట్లా భారీ స్వాగత కార్యక్రమాలు తప్ప పార్టీ పరంగా అందరినీ ఏక తాటిపైకి తెచ్చేందుకు తీసుకున్న చర్యలు శూన్యం. ఈ రెండు చోట్ల ఒక్కసారి కూడా నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటు చేయలేదు. దీంతో ఎంతసేపూ అసమ్మతిని చల్లార్చేందుకు ప్రయత్నించడమే తప్ప తమను పట్టించుకోవడం లేదనే భావన గులాబీ శ్రేణుల్లో పెరుగుతోంది. నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా అందరినీ కలుపుకునిపోవాల్సిన వద్దిరాజు.. కేవలం అసమ్మతిపైనే అధికంగా దృష్టి పెట్టడం మొదటికే మోసం తెచ్చేలా మారింది. పార్టీ గెలుపు కోసం ఆయన చేస్తున్న కృషిలో ఎలాంటి లోపం లేకపోయినా.. ఎంచుకున్న మార్గం సబబుగా లేదనే అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. సీఎం కేసీఆర్ పర్యటన నాటికి పరిస్థితులు చక్కదిద్దుతారనే నమ్మకం వారిలో కనిపిస్తోంది.

మరి మా సంగతేంటి.. ?

గత నెల రోజులుగా ఇటు ఇల్లెందు, అటు కొత్తగూడెంలో అసమ్మతి రాగాలు వినిపించిన వారికే పార్టీ పరంగా ప్రాధాన్యత దక్కుతుండడం కొత్త మలుపు తీసుకుంది. అసంతృప్తితో ఉన్న మున్సిపల్ కౌన్సిలర్ల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటున్న పార్టీ పెద్దలు.. తమతో ఎందుకు సంప్రదింపులు చేయడం లేదని సర్పంచ్ మొదలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థాయి నాయకులు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. దీంతో అప్రమత్తమైన వద్దిరాజు రెండు నియోజకవర్గాల్లోనూ గులాబీ ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం పని చేయాలని కోరుతున్నారు. పార్టీ పరంగా అండదండలు ఉంటాయని హామీ ఇస్తున్నారు.

962 కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు

కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): శాసనసభ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించే పీఓ, ఏపీఓ, ఓపీఓల కేటాయింపునకు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ జిల్లా పరిధి ఆధారంగా ఐదు నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు. జూలూరుపాడుకు జిల్లా నుంచి, భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని వెంకటాపురం, వాజేడు మండలాలు, ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని గార్ల, బయ్యారం, కామేపల్లి మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు ములుగు, ఖమ్మం జిల్లాల నుంచి సిబ్బందిని కేటాయించనున్నట్లు వివరించారు. జిల్లా పరిధిలో ఉన్న 962 పోలింగ్ కేంద్రాలకు అన్ని శాఖల నుంచి సేకరించిన సిబ్బంది జాబితా మేరకు కేటాయిస్తున్నామని తెలిపారు. అదనంగా 30 శాతం రిజర్వ్ సిబ్బందిని కలిపి 5,783 మందితో మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. సమావేశంలో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ అధికారి, డీఈఓ వెంకటేశ్వరాచారి, జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం అధికారి సుశీల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ప్రసాద్, రంగాప్రసాద్ పాల్గొన్నారు.



పాల్వంచ : కళాశాల పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

పాల్వంచ : పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్ గురువారం తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపర్చే గదులు, పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల నిర్వహణతో పాటు, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, కొత్తగూడెం రిటర్నింగ్ అధికారి శిరీష, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణపై అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు, మండల విద్యాశాఖాధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ సమయంలో తేదీ, సమయం, రన్నింగ్ సీరియల్, నంబర్ నమోదు చేయాలని అన్నారు. నామినేషన్ సమయంలో ఇతరులు 100 మీటర్ల దూరంలో ఉండాలని, మూడు వాహనాల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఈసీ విధి విధానాలకు లోబడి మాత్రమే పనిచేయాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేస్తున్న ఆదేశాలను పాటించాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి మూడుదశల్లో శిక్షణ ఇచ్చి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని చెప్పారు. నూతన ఓటర్ల నమోదుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని, ఆ దిశగా నియోజకవర్గాల్లో చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల్లో విధులను నిర్వహించే సిబ్బంది ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు సాయికృష్ణ, కిరణ్‌కుమార్ ఎన్నికల విధులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాసరావు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, కొత్తగూడెం, భద్రాచలం రిటర్నింగ్ అధికారులు శిరీష, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు సౌకర్యవంతంగా ఉండాలి

జెడ్పీ సీఈఓ విద్యాలత



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాలత

ఇల్లెందురూరల్: పోలింగ్ కేంద్రాలు సౌకర్యవంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాలలో వెలుతురు, గాలి సౌకర్యాన్ని పరిశీలించారు. ఆవరణలో తాగునీటి వసతి, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలలోకి తీసుకెళ్లేందుకు అవసరమైన ర్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

- ఎమ్మెల్యేగా మెచ్చాను గెలిపించాలి
- ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపు



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే మెచ్చా తదితరులు

దమ్మపేట: బీఆర్‌ఎస్ కార్యకర్తలంతా సమన్వయంతో పని చేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల రూపకల్పన, అమలులో సీఎం కేసీఆర్‌కు మించిన నాయకుడు మరొకరు లేరని అన్నారు. కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో రూ. 800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి, మంచితనం చూసి తనకు ఓటెయ్యాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేష్, గారపాటి సూరి, గాజుబోయిన యేసు, యార్లగడ్డ బాబు, అంకత మహేశ్వరరావు, గూడపాటి వెంకట్రావు, సైదా, జలగం వాసు, రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారంతో విద్యార్థులకు లబ్ధి


డీఈఓ వెంకటేశ్వరాచారి



అల్పాహారం వడ్డిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అల్పాహార పథకంతో విద్యార్థులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం క్రమంగా పెరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి అన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లోని రెండు పాఠశాలల్లో గురువారం ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అర్ధాకలితో పాఠశాలకు వచ్చే ఎంతోమంది పేద, మధ్య తరగతి పిల్లల ఆకలి తీరుతుందని, దీంతో వారు శ్రద్ధగా చదువుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ పథకాన్ని తొమ్మిది విడతల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ప్రధానోపాధ్యాయులు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ల కోటకు.. వైఎస్ గండి



ముర్ల ఎర్రయ్య రెడ్డి

కుంజా బొజ్జి

సున్నం రాజయ్య



కుంజా సత్యవతి



పొదెం వీరయ్య

- భద్రాచలంలో వరుసగా ఏడుసార్లు సీపీఎం హవా
- 2009లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం
- జనరల్ నుంచి ఎస్టీ రిజర్వ్ స్థానంగా మార్పు
- రాష్ట్ర విభజనతో కుదించుకుపోయిన నియోజకవర్గం

భద్రాచలం : భద్రాచలం నియోజకవర్గానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నా.. భద్రాచలంలోనే అత్యధిక సార్లు కామ్రేడ్లు విజయం సాధించారు. మొదట జనరల్‌గా ఉన్న ఈ స్థానం.. ఆ తర్వాత ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారింది. అత్యధిక గిరిజన జనాభా ఉన్న ఈ నియోజకవర్గమంతా మన్యం ప్రాంతంగా గుర్తింపు పొందింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత భారీగా కుదించుకుపోయిన ఈ నియోజకవర్గంపై ప్రత్యేక కథనం..

1952లో మద్రాస్ రాష్ట్రంగా ఉన్న సమయంలో భద్రాచలం నియోజకవర్గం ఆవిర్భవించింది. మొదట మద్రాసు రాష్ట్రంలో, 1955లో ఆంధ్ర, 1957లో ఆంధ్రప్రదేశ్, 2014లో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. తొలుత గిరిజనులు, గిరిజనేతరులు ప్రాతినిధ్యం వహించే ద్విసభ్య నియోజకవర్గంగా ఉండగా 1967లో ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారింది. 1952 నుంచి ఇప్పటి వరకు 16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా సీపీఎం ఎనిమిది పర్యాయాలు, కాంగ్రెస్ ఐదుసార్లు గెలిచింది. సీపీఎంకు చెందిన ముర్ల ఎర్రయ్య రెడ్డి రెండుసార్లు గెలిచిన ఏకైక కొండరెడ్ల జాతికి చెందిన వ్యక్తిగా రికార్డు పొందారు.

వైఎస్సార్ ప్రభావంతో..

1978 నుంచి 2004 వరకు సీపీఎం అభ్యర్థులే వరుసగా ఏడుసార్లు విజయం సాధించారు. ఇలా ఆ పార్టీకి కంచుకోటగా ఉన్న భద్రాచలంలో 2009లో కాంగ్రెస్ నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభావంతో గండిపడింది. ఆ ఎన్నికల్లో భద్రాచలం నుంచి కుంజా సత్యవతికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చి గెలిపించారు. దీంతో వరుసగా కమ్యూనిస్టుల అడ్డాగా ఉన్న భద్రాచలం నియోజకవర్గంలో మార్పు ప్రారంభమైంది. 2014లో జరిగిన ఎన్నికలలో మళ్లీ సీపీఎం జెండా రెపరెపలాడింది. మళ్లీ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపొందారు. ఆ ఎన్నికల్లో సీపీఎం మూడో స్థానానికి పరిమితం కావడం గమనార్హం.

కుంజా బొజ్జి హ్యాట్రిక్..

ఇప్పటివరకు 16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా సీపీఎం 12 సార్లు పోటీ చేసి ఎనిమిది మార్లు గెలుపొందింది. ఆ పార్టీకి చెందిన ముర్ల ఎర్రయ్య రెడ్డి 1978, 1983లో గెలుపొందగా, కుంజాబొజ్జి 1985, 1989, 1994లో ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. 1999, 2004, 2014 ఎన్నికల్లో సున్నం రాజయ్య విజయం సాధించారు. 1952, 1967, 1972, 2009, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. మొత్తంగా ఇక్కడ సీపీఎం – కాంగ్రెస్ మధ్యే పోటాపోటీ నడిచింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో టీఆర్‌ఎస్ నుంచి మానె రామకృష్ణ పోటీ చేసినా.. ప్రభావం చూపలేక పోయారు. 2014లో పోటీ చేసిన తెల్లం వెంకట్రావు 11,785 ఓట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మళ్లీ ఆయన బరిలోకి దిగుతున్నారు. ఈసారి ఫలితం ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే.

8 నుంచి ఐదు మండలాలకు..

రాష్ట్ర విభజనకు ముందు భద్రాచలం నియోజకవర్గం ఎనిమిది మండలాల్లో విస్తరించి ఉండేది. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇదే పెద్ద నియోజకవర్గం. కానీ రాష్ట్ర విభజనతో వీఆర్‌పురం, చింతూరు, కూనవరం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిశాయి. దీంతో ఈ నియోజకవర్గం ప్రస్తుతం ఐదు మండలాలకే పరిమితమైంది. ఇందులోనూ వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లాలో విలీనం అయ్యాయి.

ఇప్పటి వరకు గెలిచిన ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	విజేత	పార్టీ
1952 (ద్విసభ్య)	కారం బాపన్న దొర, వై.వి.కృష్ణారావు	కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ
1955 (ద్విసభ్య)	ఎండీ తహశీల్, ఎస్.సీతారామయ్య	సీపీఐ
1957 (ఉప ఎన్నిక)	పీవీ రావు	కాంగ్రెస్
1962	మహ్మద్ తహశీల్	సీపీఐ
1967	కన్నయ్య దొర	కాంగ్రెస్
1972	ముట్టా రామచంద్రయ్య	కాంగ్రెస్
1978	ముర్ల ఎర్రయ్య రెడ్డి	సీపీఎం
1983	ముర్ల ఎర్రయ్య రెడ్డి	సీపీఎం
1985	కుంజా బొజ్జి	సీపీఎం
1989	కుంజా బొజ్జి	సీపీఎం
1994	కుంజా బొజ్జి	సీపీఎం
1999	సున్నం రాజయ్య	సీపీఎం
2004	సున్నం రాజయ్య	సీపీఎం
2009	కుంజా సత్యవతి	కాంగ్రెస్
2014	సున్నం రాజయ్య	సీపీఎం
2018	పొదెం వీరయ్య	కాంగ్రెస్

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ గాలం..?



మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్యతో చర్చిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఇల్లెందురూరల్: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఊకెఅబ్బయ్యను తిరిగి పార్టీలోకి రప్పించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మరికొందరు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మొట్లగూడెం గ్రామ శివారులో గురువారం సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా మండలంలోని హనుమంతుల పాడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఊకె అబ్బయ్య ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. బీఆర్ఎస్‌లోకి తిరిగి రావాలని, భవిష్యత్ ఉంటుందని నచ్చచెప్పే ప్రయత్నం చేయగా, అబ్బయ్య సున్నితంగా తిరస్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, టీజీబీకేఎస్ ఉపాధ్యక్షుడు రంగనాథ్, బీఆర్ఎస్ నాయకులు బానోత్ హరిసింగ్, జేకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

సుజాతనగర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వే వంతెన సమీపంలో చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సరైన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలు చూపాలని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై ఎం సోమేశ్వర్,సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.13 లక్షల నగదు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న సీఎంఎస్ సంస్థ వాహనం

దమ్మపేట: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నారు. ఆధారాలు చూపని నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తున్నారు. గురువారం దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి క్రాస్ రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అశ్వారావుపేట నుంచి వస్తున్న సీఎంఎస్‌కు సంస్థకు చెందిన ఏటీఎం నగదు సరఫరా చేసే మినీ వ్యానులో రూ.13 లక్షలు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించి సీఎంఎస్ సంస్థ, బ్యాంకు అధికారులు సరైన పత్రాలను, ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న చంద్రశేఖర్ కుటుంబం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో... (దుమ్ముగూడెం: మండలంలోని సర్పాపురంలో ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన చిన్నా అరుణాచలంలో నిత్యాన్నదానం కోసం సారపాక గ్రామస్తులు రూ.లక్ష వితరణగా అందజేశారు. సారపాకకు చెందిన జలగం చంద్రశేఖర్, కల్యాణి దంపతులు, చంద్రశేఖర్ తల్లి జయప్రద నిత్యాన్నదానం కోసం జలగం మధుసూదన్‌రావు జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు ఆలయ వ్యవస్థాకులు శివనాగస్వామికి గురువారం అందజేశారు. అలాగే, ఉత్తర ద్వార నిర్మాణానికి అజ్ఞాత భక్తుడు రూ.లక్ష అందజేశారని శివనాగస్వామి తెలియజేశారు.

కొనసాగిన ఐసీఎంఆర్ బృందం పర్యటన


కరకగూడెం: కరకగూడెం మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన అశ్వాపురపాడులో పూణేకు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) బృందం పర్యటన కొనసాగుతోంది. రెండో రోజైన గురువారం కేంద్ర బృందం సభ్యులు గ్రామస్తులను పరీక్షించి రక్తనమూనాలను సేకరించారు. ఇందులో ఐదుగురికి ఆర్‌డీటీ పాజిటివ్‌గా తేలడంతో మందులు అందజేశారు. ఐసీఎంఆర్ బృందం సభ్యులు మనీష్‌కుమార్, పాండేవ్ భట్, నరేంద్ర చంద్రవంశీ, వైద్యాధికారి దుర్గనరేష్, ఉద్యోగులు అరుణ్‌బాబు, నాగరత్నం, జ్యోతి, నర్సింహారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,231

పత్తి కొనుగోళ్లకు 14 కేంద్రాలు

- సీసీఐ ఆధ్వర్యాన ఏర్పాటుకు రెడీ
- ఖమ్మం జిల్లాలో పది, భద్రాద్రి జిల్లాలో నాలుగు కేంద్రాలు



సీసీఐ కేంద్రాలకు వాహనాల్లో తీసుకొచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యాన పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. ఈమేరకు ఖమ్మం జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని పది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తికాగానే కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. ఇప్పటికే సీసీఐ ఉన్నతాధికారులు నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలకు బయ్యర్లను ఎంపిక చేయగా, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీల సహకారంతో పత్తి కొనుగోళ్లు చేపడుతారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం పత్తి క్వింటాకు తేమశాతం ఆధారంగా గరిష్టంగా రూ.7,020 మద్దతు ధర నిర్ణయించింది. కానీ ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తుండడంతో సీసీఐ రంగంలోకి దిగుతోంది. ఖమ్మం జిల్లాలో 1,85,225 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2,00,373 ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా, రెండు జిల్లాల్లో కలిపి 2,84,990 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కాగా, సీసీఐ పత్తి కొనుగోళ్లలో రైతు ఆధార్ నంబర్ నమోదును తప్పనిసరి చేయగా, వ్యవసాయ శాఖ సదరు రైతు పంట సాగు చేసినట్లు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

ఎక్కడెక్కడంటే...

ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్, పొన్నెకల్‌లోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్స్, తల్లంపాడులోని శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపడుతారు. అలాగే, మధిర మండలం దెందుకూరులోని అమరావతి టెక్స్‌టైల్స్, మాటూరులోని మంజీత కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, ఇల్లెందులపాడులోని శ్రీ శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీస్, ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్స్, తల్లాడలోని స్టేపుల్‌రిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, కూసుమంచి మండలం జీళ్లచెర్వులోని దేదీప్య రామా కాటన్ ఇండస్ట్రీస్, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని శ్రీ భాగ్యలక్ష్మీ కాటన్ ఇండస్ట్రీస్‌లో కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఇక ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం అప్పాయిగూడెంలోని శ్రీ లక్ష్మీప్రియ కొటెక్స్ జిన్నింగ్ మిల్‌ను కూడా భద్రాద్రి జిల్లా పత్తి కొనుగోళ్లకు కేటాయించారు. దీంతో పాటు సుజాతనగర్ మండలం డేగలమడుగులోని మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, అశ్వాపురం మండలం నెల్లిపాక బంజరలోని శ్రీ రామా కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్, బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని అనుశ్రీ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం



కొత్తగూడెంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ సాయి మనోహర్



ఇల్లెందులో రక్తదానం చేస్తున్న పోలీసులు

అడిషనల్ ఎస్పీ సాయి మనోహర్

నవభారత్: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలు మరువలేనివని అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయి మనోహర్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వేడుకలను పురస్కరించుకుని గురువారం కొత్తగూడెం ఐఎంఏ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఏఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. 120 మంది యువకులతోపాటు సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది రక్తదానం చేశారని అన్నారు. రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయబాబు, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, సీఐలు నాగరాజు, ఎం. కరుణాకర్, రమేష్, ఓదెల మురళి, ఆర్ఐలు రవి, సుధాకర్, నరసింహారావు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: పోలీసుల త్యాగం అజరామరం అని డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలు ఎన్నటికి మరిచిపోలేమని అన్నారు. ఇల్లెందు, గుండాల, టేకులపల్లి మండలాల యువకులు, సీఐలు టి.కరుణాకర్, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది రక్తదానం చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్

- వచ్చే ఎన్నికల్లో కుటుంబపాలనకు చరమగీతం
- మాజీ ఎంపీ, ఇల్లెందు బీజేపీ అభ్యర్థి రవీంద్రనాయక్



కొత్తగూడెం సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

చుంచుపల్లి/ఇల్లెందు: తెలంగాణ ఏర్పడే నాటికి మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్ల కాలంలో కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ఎంపీ, ఇల్లెందు బీజేపీ అభ్యర్థి ధరావత్ రవీంద్ర నాయక్ ఆరోపించారు. కొత్తగూడెంలోని జిల్లా పార్టీ కార్యాలయం, ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎందరో త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ నేడు కేసీఆర్ కుటుంబ హస్తాల్లోకి వెళ్లిందని, ఎవరూ తీర్చలేని విధంగా రూ.13 లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు జీతభత్యాలు ఇచ్చే పరిస్థితి లేకపోగా, 36 లక్షల మంది నిరుద్యోగుల ఆవేదనను పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. విద్య, వైద్య రంగాలు అస్తవ్యస్తంగా మారాయని, అద్భుతంగా చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కుప్పకూలే స్థితికి చేరిందని చెప్పారు. ఇల్లెందుకు బొగ్గుగనుల పరంగా ఎంతో ప్రాధాన్యత ఉండగా.. గడిచిన పదేళ్ల కాలంలో ఒక్క బొగ్గు పరిశ్రమను కూడా బీఆర్ఎస్ తీసుకురాలేదని ఆరోపించారు. అలాగే, ఎస్టీ, నాన్ ఎస్టీల మధ్య వైషమ్యాలు పెంపొందించారని చెప్పారు. ఎప్పటిలాగే మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకునేందుకు కేసీఆర్ బయలుదేరారని చెప్పారు. ఈమేరకు ప్రజలకు బీఆర్ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పాడడమే కాక రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలని రవీంద్రనాయక్ కోరారు. ఈసమావేశాల్లో బీజేపీ జిల్లా సమన్వయకర్త నాళ్ల సోమసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు ఆకుల నాగేశ్వరరావు, పైడిపల్లి రవీందర్, బలగాని గోపీకృష్ణ, మాలోతు రమేష్, లక్కినేని సాయి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో రక్షణ పక్షోత్సవాలు ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో గురువారం నుంచి రక్షణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 7వ తేదీ వరకు కొనసాగనుండగా, సింగరేణి వ్యాప్తంగా ఉన్న గనులు, డిపార్ట్‌మెంట్లలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. భూగర్భ గనులను మూడు గ్రూపులుగా, ఓపెన్‌కాస్ట్ గనులను మూడు గ్రూపులుగా, వర్క్‌షాపులు, ఇతర డిపార్ట్‌మెంట్లను 11 విభాగాలుగా విభజించి తనిఖీలు చేస్తామని, రక్షణ సూత్రాల అమలును పరిశీలించి మార్కులు కేటాయిస్తామని వివరించారు. ఉద్యోగులందరూ బాధ్యతగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు, పనిస్థలంలో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు.

డీసీసీబీ ఉద్యోగులకు మెమోలు జారీ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో పనిచేసే వివిధ స్థాయి అధికారులు, ఉద్యోగులు పలువురికి గురువారం ఇన్‌చార్జ్ సీఈఓ కె.నర్మద మెమోలు జారీ చేశారు. బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఒకరు ఖమ్మంలో ఈనెల 24వ తేదీన గృహ ప్రవేశం చేశారు. పలువురు అధికారులు, ఉద్యోగులు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరై ఫంక్షన్‌లో పాల్గొన్నారు. ఈ విషయం తెలియడంతో పది మందికి ఇన్‌చార్జ్ సీఈఓ మెమోలు జారీ చేశారు. అయితే, సెలవులో ఉన్న కొందరికి కూడా మెమోలు జారీ అయినట్లు సమాచారం. ఈమేరకు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో సూచించారు.

మద్యం, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట



సమావేశంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల అధికారులు

అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో ఎక్సైజ్ శాఖ ఖమ్మం డీసీ జనార్దన్‌రెడ్డి

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా, గంజాయి రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బూర్గంపాడు మండలం సారపాకలో గురువారం ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎక్సైజ్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా, గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద మూడు రాష్ట్రాల అధికారులతో కలిసి తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఛత్తీస్‌గఢ్, ఏపీ అధికారులు గణేష్, జానయ్య, గజేందర్, కరంచంద్, రహీమున్నీసా, గురునాథ్ రాథోడ్, శ్రీనివాసరావు, వంశీకృష్ణ, సమర్థ్, నాగేశ్వరరావు, గౌతమ్, రతన్, ప్రసాద్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ఒకరికి జైలుశిక్ష

నవభారత్: గంజాయి తరలిస్తూ పట్టుబడిన వ్యక్తికి 12ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. 2020 సంవత్సరం ఆగస్టు 9న భద్రాచలంలో వాహనాల తనిఖీ చేపట్టగా కారులో గంజాయితో వెళ్తున్న మహబూబాబాద్ జిల్లా కలకత్తాతండాకు చెందిన వాంకుడోత్ బలరాం అలియాస్ బాలు, విశాఖ జిల్లా చింతపల్లికి చెందిన కొర్ర దొరబాబు, ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన ముత్తినేని కిషన్‌కుమార్, మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన వాంకుడోత్ రమేష్ పట్టుబడ్డారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొస్తున్న 200 కేజీలకు పైగా గంజాయి లభించింది. దీంతో భద్రాచలం టౌన్ సీఐ టి.స్వామి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం వాంకుడోతు బలరాంపై నేరం రుజువు కావడంతో 12ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. ఇక దొరబాబు, ముత్తినేని కిషన్‌కుమార్‌పై నేరం రుజువు కాకపోవడంతో కొట్టివేయగా, వాంకుడోత్ రమేష్ ఆచూకీ తెలియకపోవడంతో కేసు పెండింగ్‌లో పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రావి విజయకుమార్ వాదించగా ఎం.హరిగోపాల్, గంజి శశిధర్ సహకరించారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టే వారితోనే దోస్తీ

ఎమ్మార్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

పాల్వంచ/జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చి నెరవేర్చే పార్టీకే ఈ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. పాత పాల్వంచలో గురువారం మాదిగల విశ్వరూప సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించడమే తమ ధ్యేయమని, తద్వారా జాతికి వందేళ్లకు సరిపడా అభివృద్ధి ఫలాలు అందుతాయని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఎస్సీ రిజర్వేషన్‌పై తీర్మానం చేసి విస్మరించగా, కేసీఆర్ మంత్రివర్గంలో మాదిగలకు చోటు ఇవ్వలేదని ఆరోపించారు. వచ్చే జనవరి 7న ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వేసిన కేసు విచారణకు వస్తుందని, తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, పాల్వంచకు వెళ్లే సమయాన మార్గమధ్యలో జూలూరుపాడులో కూడా మంద కృష్ణ కాసేపు ఆగారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించాక ఆయన మాట్లాడుతూ నవంబర్ 18న హైదరాబాద్‌లో జరిగే మాదిగ విశ్వరూప బహిరంగ సభకు ప్రధాన మోదీని ఆహ్వానించనున్నామని తెలిపారు. ఈ సభకు జెండాలు, అజెండాలు పక్కనపెట్టి మాదిగలందరూ ఐక్యంగా తరలిరావాలని కోరారు. ఈసమావేశాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి సోమయ్య, నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, వంగూరి ఆనందరావు, రేపంగి రమణయ్య, మిరియాల వెంకటేశ్వర్లు, వంగూరి రామ్మూర్తి, గుర్రం నాగమణి, అలివేలు మంగ, మందా సురేష్, మిర్యాల కిరణ్, పోతురాజు నాగరాజు, వేల్పుల నర్సింహారావు, మోదుగు సుగుణరావు, కోట కుమార్‌బాబు, ఇడుపుల రాజు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం గ్రామ శివారులోని పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ.2,610 నగదు, మూడు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బత్తుల శివపార్వతి(18)కి అదే గ్రామానికి చెందిన గోవర్ధన్‌తో రెండు నెలల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు అన్యోన్యంగా జీవించేవారు. దసరా పండుగకు వారం రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ఆమె గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. భర్త, ఇరుగుపొరుగువారు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



కొండరాజు(ఫైల్)

దుమ్ముగూడెం: చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బొజ్జిగొప్ప గ్రామానికి చెందిన పాలమంచి కొండరాజు (27) ఇంట్లో గొడవల కారణంగా మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి రెండేళ్ల క్రితమే వివాహమైంది. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. కాగా ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కొండరాజు చనిపోయాడని కుటుంబ సభ్యుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ప్రెజర్ బాంబు పేలి ఆవు మృతి


చర్ల: పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబు పేలి ఆవు మృతి చెందింది. మరొక ఆవుకు తీవ్ర గాయాలయాయి. ఈ సంఘటన చర్ల మండలంలోని పూసుగుప్ప అటవీ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకోగా ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పూసుగుప్ప గిరిజన రైతులు తమ పశువులను సమీపంలోని అటవీ ప్రాంతానికి మేతకు తోలుకెళ్లారు. కాగా కూంబింగ్ కోసం వచ్చే పోలీసు బలగాలను మట్టుబెట్టాలనే ఉద్దేశంతో అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబును ఆవు తొక్కడంతో పేలి పోయి మృతి చెందింది. మరొక ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల సమాచారంతో ఎస్సైలు నర్సిరెడ్డి, టీజీఆర్ నూరి ప్రత్యేక పోలీసు బలగాలతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో మరేమైనా మందుపాతరలు ఉన్నాయేమోనని వెదికారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు

టేకులపల్లి: దంపతులపై దాడి ఘటనలో పోలీసులు గురువారం నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. టేకులపల్లి పంచాయతీ లచ్చతండాకు చెందిన జాటోతు రవి, సునీత దంపతులు తొమ్మిదో మైలుతండాలో రెండెకరాలు చేను కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేపట్టారు. బుధవారం తోటకు బోరు ద్వారా నీరు పెడుతున్న సమయంలో పైపులైన్ లీకై డొంక దారిపై పారింది. ఈ విషయమై వారితో తొమ్మిదో మైలుతండాకు చెందిన జాటోతు బాలాజీ, జాటోతు సురేందర్, జాటోతు మోహన్, జాటోతు లక్ష్మి గొడవకు దిగారు. బూతులు తిడుతూ దంపతులను కింద పడేసి చేతులతో, కాళ్లతో దాడి చేసి గాయపర్చారు. బాధితులు సులానగర్ పీహెచ్‌సీలో, అనంతరం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందారు. గురువారం బాధితురాలు సునీత ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికలు బహిష్కరించండి

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు



చర్ల మండలం పులిగుండాల సమీపంలో ప్రధాన రహదారిపై వదిలిన కరపత్రం

చర్ల/దుమ్ముగూడెం : ఓట్ల కోసం వస్తున్న రాజకీయ నాయకులను నిలదీయాలని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఎన్నికలు బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ మరోమారు పిలుపునిచ్చింది. ఈ మేరకు చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని పలు రహదారులపై బుధవారం అర్ధరాత్రి కరపత్రాలు, పోస్టర్లు వదిలారు. మహిళల మనుగడకు అడ్డంకిగా ఉన్న మనువాద పితృస్వామ్య భావజాలాన్ని రూపుమాపుతారా, అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తారా, స్త్రీ, పురుష సమానత్వం కోసం కృషి చేస్తారా అని కేంద్ర, రాష్ట్ర పాలకులను ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాలయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, పెద్ద ఎత్తున వెలసిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి



మృతి చెందిన శిశువు



పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

చండ్రుగొండ : చండ్రుగొండ ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ ఫర్జాన నిండు గర్భిణి కాగా, కాన్పు నిమిత్తం బుధవారం రాత్రి చండ్రుగొండ పీహెచ్‌సీలో చేరింది. గురువారం ఉదయం నొప్పులు ఎక్కువ కావడంతో సాధారణ కాన్పు అవుతుందని వైద్యసిబ్బంది భావించారు. ఈ క్రమంలో తలభాగం వరకు బయటకు వచ్చిన ఆడశిశువు చనిపోయింది. శిశువు చనిపోవడంతో కుటుంబ సభ్యులు పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. డాక్టర్ తనుజతోపాటు సిబ్బంది బాధితులకు సర్దిచెప్పడంతో బాధితులు శాంతించారు.